క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల ఏర్పాటు

చిట్టమూరు : మండలంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మండల ఇన్‌చార్జి కంటేపల్లి మస్తానయ్య మాదిగ పేర్కొన్నారు. మల్లాం, ధరఖాస్తు, ఈశ్వరవాక గ్రామాల్లో శనివారం కమిటీలను నియమించామన్నారు. తిరుపతి జిల్లా ఇన్‌చార్జి వర్ల దేవదాస్ మాదిగ హాజరై చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీలకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు మాసవరం విజయలక్ష్మి, సూళ్లూరుపేట మండల అధ్యక్షుడు కుక్కమల్లి రవి మాదిగ, ఎల్లసిరి మహేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



క్షయ వ్యాధిపై ర్యాలీ చేస్తున్న వైద్యులు

దక్కిలి: క్షయ వ్యాధి (టీబీ) నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టీబీ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, మిథున్ కుమార్ తెలిపారు. మండలంలోని సంగనపల్లి, వడ్ల మోపూరు సచివాలయాల పరిధిలో శనివారం టీబీ ముక్తా భారత్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బిందు ప్రియాంక, శ్రీహరి, హెల్త్ సైపర్‌వైజర్ ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది సిద్దారెడ్డి, దినకర్ పాల్గొన్నారు.

బదిలీ సన్మానం

దొరవారిసత్రం : మండలంలోని అక్కరపాక గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సల్మా, రుక్మిణిని శనివారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాధకృష్ణయ్య, రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రావణి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

గూడూరురూరల్ : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో శనివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని కార్యక్రమం ద్వారా శనివారం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రతినెలా పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు

కరపత్రాల ఆవిష్కరణ

నాయుడుపేటటౌన్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 9న నిర్వహించనున్న జరిగే సమ్మె కరపత్రాలను సీఐటీయూ నాయకులు ముకుందా ఆవిష్కరించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులతో సమావేశం జరిపారు. కార్మికుల సమస్యలపై నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక వర్గాలు పాల్గొనాలని తీర్మానించారు. ముఠా వర్కర్స్ యూనియన్ నాయకుల రమణయ్య, పేరయ్య, మహేష్ వేలు పాల్గొన్నారు.

9న ఒక రోజు శిక్షణ

రాపూరు: మండలంలోని మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎస్‌ఎం, పంచాయితీ కార్యదర్శులకు ఈ నెల 9వ తేదీ ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



తడ : జాతీయ రహదారిపై శ్రీసిటీ జీరో పాయింట్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు, చెంగల్‌పట్టు జిల్లా, తిరుక్కళ్‌కుంద్రం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వేదగిరి (40) మృతి చెందాడు. ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రా నుంచి ఇనుప పైపుల లోడ్‌తో చెన్నై వెళుతున్న లారీ అదే మార్గంలో బాలఏసు పుణ్య క్షేత్రం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీలోని ఇనుప పైపులు ఒక్క ఉదుటున క్యాబిన్ మీదకు దూసుకు రావడంతో రెండింటి మధ్య వేదగిరి ఇరుక్కుపోయాడు. మృత్యువుతో పోరాడుతున్న లారీ డ్రైవర్‌ని రక్షించేందుకు స్థానికులు, రోడ్డుపై వెళుతున్న వాహనదారులు తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, క్రేన్ సాయంతో పైపులు తొలగించి, లారీని వెనక్కు లాగి, తీవ్రంగా గాయపడ్డ వేదగిరిని బయటకు తీసి సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చిగురుపాడు : స్వర్ణముఖి నదిలో పొర్లు కట్టలను తెగ్గొట్టి ఏర్పాటు చేసిన దారులు





పొర్లు కట్టలు ధ్వంసం

స్వర్ణముఖి నదిని చెరబట్టిన అక్రమార్కులు పొర్లుకట్టలను ధ్వంసం చేస్తున్నారు. దీనిపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా పట్టించుకునే దిక్కు లేకపోవడం గమనార్హం. పట్టణ పరిధిలోని ఎల్‌ఏ సాగరం, బీడీ కాలనీ, చిగురుపాడు, తుమ్మూరు, మర్లపల్లి, అన్నమేడు, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు, మూర్తిరెడ్డిపాళెం తదితర గ్రామాల్లో స్వర్ణముఖి నది పొర్లు కట్టలను ధ్వంసం చేశారు. ఇసుక, మట్టి రవాణాకు వీలుగా ఈ పొర్లుకట్టలను తవ్వేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు సమీప ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఈ పొర్లు కట్టలు అడ్డుకుంటాయి. వీటిని ధ్వంసం చేయడం వల్ల సమీప ప్రాంతాలకు ముంపు ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పొర్లుకట్టల ధ్వంసంపై పరిశీలించి అక్రమార్కులపై చర్యలు చేపడతామని ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్ తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి పొర్లుకట్టల విధ్వంసానికి అడ్డుకట్ట వేస్తామని చెప్పారు.

– నాయుడుపేటటౌన్

రాజీ మార్గమే ఉత్తమ పరిష్కారం

గూడూరురూరల్ : కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలాన్ని వృథాకోకుండా కేసులను పరిష్కరించుకునేందుకు రాజీయే రాజమార్గమని ఏడో అదనపు జిల్లా జడ్జి కె.వెంకట నాగ పవన్ అన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో కక్షిదారులకు అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ క్షణికావేశాలకు లోనై చిన్నచిన్న ఘర్షణల కారణంగా కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని చెప్పారు. శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 223 కేసులు పరిష్కరించడంతోపాటు రూ.1.54 కోట్ల మేర కక్షిదారులకు పరిహారం అందించినట్లు తెలిపారు. ఇందులో 40 సివిల్, 78 క్రిమినల్, 84 ప్రీ లిటిగేషన్ బ్యాంకు కేసులు, ఒక మెయింటెనెన్స్ కేసు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వి.సులోచన రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమాశంకర్, సీనియర్ ఏపీపీ లక్ష్మీనారాయణ, పార్వతయ్య, కోటేశ్వరరావు, మహబూబ్‌బాషా, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

65 కేసులు పరిష్కారం

సూళ్లూరుపేట : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 303 కేసులకు గాను శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ 65 కేసులను పరిష్కరించినట్టుగా జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త తెలియజేశారు. ఇందులో మూడు సివిల్ కేసులు, మిగిలిన 63 క్రిమినల్ కేసులను పరిష్కరించారు.

అదాలత్‌లో 31 కేసుల పరిష్కారం

కోట: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఇన్‌చార్జ్ జడ్జి మీనాక్షి సుందరి ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 31 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు.

120 కేసుల పరిష్కారం

నాయుడుపేటటౌన్: నాయుడు పేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు సంబంధించి మొత్తం 120 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మీనాక్షి సుందరి తెలిపారు. బాధితులకు నష్ట పరిహారంగా రూ.25,70,200 అందించినట్లు వివరించారు.

పాఠశాలను విలీనం చేయొద్దని నిరసన



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, సీఐటీయూ నాయకులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను తుమ్మూరులో విలీనం చేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. స్థానిక సీఐటీయూ నాయకులు ముకుందా మాట్లాడుతూ, ఇక్కడి నుంచి రైలు పట్టాలు, జాతీయ రహదారి దాటుకుని తుమ్మూరులోని పాఠశాలలకు తమ పిల్లలను పంపేది లేదని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ నిర్మల, రమణమ్మ, పద్మమ్మ, రేవతి, షాకిరా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 32 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 32.117టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2100, పిన్నేరుకాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని బొగ్గులమిట్ట సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తోలిమిట్ట, శివాలయంవీధి, ఆందపురం, బొగ్గులమిట్ట, హనుమాన్ నగర్, చెలికంపాడు ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌కు చర్యలు

వెంకటగిరి రూరల్ : పట్టణంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని పోలేరమ్మతల్లి ఆలయం సమీపంలో శనివారం రెండు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీపోలేరమ్మతల్లి జాతర నేపథ్యంలో పట్టణంలో 23 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ముని రవిచంద్ర, ఏఈ అశోక్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు



మేకలకు నట్టల నివారణ మందులను వేస్తున్న పశువైద్యులు

కలువాయి(సైదాపురం): మండలంలోని జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. పశు సంవర్ధక శాఖ డీడీ నాగమణి గ్రామాలను సందర్శించి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పశువుల్లో ముందస్తు వ్యాధి నివారణలో భాగంగా నట్టల నివారణ టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ గురుజయంతి, డాక్టర్ కృష్ణమోహన్, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

నాయుడుపేటటౌన్: విద్యుత్ ప్రమాదాలతో ప్రాణ నష్టం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఏపీ ఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ కే గురువయ్య సూచించారు. పట్టణంలోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో శనివారం సాయంత్రం డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు సరిచేయాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు నాయుడుపేట, అన్నమేడు, మేనకూరు, కేజీ కండ్రిగలలో విద్యుత్ సబ్ స్టేషన్లను తనిఖీలు చేశారు. ఈఈ శ్రీనివాసులు, డీఈలు వరప్రసాద్ రెడ్డి, శేఖర్, రవిచంద్ర, ఏఏఓ శ్రీలత, 12 మండలాలకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.

గరుడుడిపై నృసింహుడు



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి శనివారం రాత్రి బంగారు గరుడ వాహనంపై ఊరేగారు. శ్రీవారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివారికి చందనంతో అలంకరించి, అభిషేకం చేశారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం నిర్వహించారు. రాత్రి బంగారు గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువు తీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ మాఢవీధుల్లో ఊరేగించారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరురూరల్ : రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను విపరీతంగా పెంచిందని, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, సీపీఐ నాయకులు సీవీఆర్ కుమార్, రమేష్, నారాయణ, యాకోబు, రాఘవయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇంటి స్థలాల సర్వే

దొరవారిసత్రం: శ్రీహరికోట నిర్వాసితులకు ఇంటి స్థలాలను కృష్ణాపురం ఎస్టీ కాలనీ ప్రాంతంలో కేటాయించేందుకు దొరవారిసత్రం రెవెన్యూ అధికారులు శనివారం సర్వే పనులు చేపట్టారు. మూడు రోజుల కిందట డీవీ సత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టాలు చేత పట్టుకుని బాధితులు నిరసనకు దిగారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి కృష్ణాపురం ప్రాంతంలో నిర్వాసితులకు ఇచ్చిన స్థలంలో ప్రస్తుతం ఎంత భూమి ఉందో గుర్తించే పనిలో పడ్డారు. అర్హత ఉన్న వారికి ఇంటి స్థలాలను చూపనున్నట్లు స్థానిక తహసీల్దార్ శైలకుమారి తెలియజేశారు. సర్వే పనుల్లో మండల సర్వేయర్ నాగరాజు, సచివాలయం సర్వేయర్ శ్యామ్, వీఆర్వో వరప్రసాద్ పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డికి పరామర్శ



రాధాకృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మనుబోలు సతీష్‌రెడ్డిని శనివారం స్థానిక సంస్థ ఎమ్మెల్సీ గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పరామర్శించారు. ఇటీవల సతీష్‌రెడ్డి తండ్రి రాధాకృష్ణారెడ్డి మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన ఉత్తర క్రియలకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. అనంతరం రాధాకృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సతీష్‌రెడ్డిని పరామర్శించి, మనోధైర్యం చెప్పారు.

ఆటో-కారు ఢీ: ఒకరికి తీవ్రగాయాలు



బోల్తా పడిన ఆటో

వెంకటగిరి రూరల్: ఆటో-కారు ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన వంకాయల జయరామిరెడ్డి రాపూర క్రాస్‌రోడ్డులోని కైవల్యానది సమీపంలో ఆటో వెళుతుండగా బద్వేల్‌కు చెందిన చిన్ని కృష్ణ చెన్నై విమానాశ్రయం నుంచి వెంకటగిరి బయల్దేరారు. అయితే కాంపాళెం కైవల్యానది వాగు సమీపంలో కారు అదుపుతప్పి ఆటోను ఢీనడంతో ఆటోడ్రైవర్ జయరామరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు.

చెంగాళమ్మఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కే నవీన్‌కుమార్, ఆలయ ఏసీ, ఈఓ బీ ప్రసన్నలక్ష్మీ సమక్షంలో శనివారం హుండీని లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 103 రోజులకు రూ.61,71,477 హుండా ఆదాయం వచ్చింది. విదేశీ కరెన్సీ యూఎస్‌ఏ డాలర్స్ 10, సింగపూర్ డాలర్స్ 5, మలేషియా రింగట్స్ 10, సౌదీ రియల్స్ 1, యూరో 5 ఆదాయం వచ్చినట్టుగా ఆలయ సహాయ కమిషనర్ బీ ప్రసన్న లక్ష్మి తెలియజేశారు. 35 గ్రాముల బంగారం, 130 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చిందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు, పోలీస్‌శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల గుంటల పనులు సక్రమంగా చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బాలాయపల్లి(సైదాపురం): చేపల గుంటల పనులు సక్రమంగా చేయాలని ఎంపీడీఓ వినీల్ కుమార్ పేర్కొన్నారు. ఆయన శనివారం మండలంలోని కోటంబేడులో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న చేపల గుంటల పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేపలు గుంతలు తవ్వుకోవడం రైతులకు ఆర్థికంగా ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు ఉన్నారు.

నిరు పేదలకు భూ పంపిణీ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

వెంకటగిరి రూరల్: భూమి లేని నిరుపేద దళిత, గిరిజనులకు భూ పంపిణీ చేయాలని సీపీఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. కలపాడు భూ పోరాట సమితి, సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామంలో కొంత మంది రాజకీయ పలుకుబడిన వారు జేసీబీ యంత్రాలతో రాత్రికి రాత్రి భూమి చదును చేసుకుంటున్నట్లు ఆరోపించారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో వారికి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఆ వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెంచుకృష్ణయ్య, బాలసుబ్రమణ్యం, సమరం, నాగేశ్వరరావు, దారా కృష్ణయ్య పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర

జగన్నాథుడి రథాన్ని లాగుతున్న భక్తులు, (ఇన్‌సెట్) రథంపై కొలువైన స్వామివారు



గూడూరురూరల్ : నెల్లూరు ఇస్కాన్ బృందం, గూడూరు సొసైటీ ప్రాంతంలోని ఇస్కాన్ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. సొసైటీ ప్రాంతంలోని నారాయణమ్మ పేరంటాలు గుడి వద్ద నుంచి రథయాత్రను ప్రారంభించారు. సొసైటీ, ఐసీఎస్ రోడ్డు, ఆస్పత్రిరోడ్డు, సంగం థియేటర్ కూడలి, రాజావీధి, టవర్‌క్లాక్ సెంటర్, డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు వరకు రథయాత్ర సాగింది. రథాన్ని లాగేందుకు పట్టణ ప్రజలు పోటీపడ్డారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల ఆకట్టుకున్నారు.